కాలుష్యరహిత హైదరాబాదే లక్ష్యం

- పాతికేళ్ల అవసరాలకు తగినట్లు ప్రణాళికలు
- నగరానికి ఐకానిక్‌గా మూసీ అభివృద్ధి ఉండాలి
- ఎంఎయుడి సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



అధికారులతో సమీక్షిస్తున్న సిఎం రేవంత్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నగరాన్ని పర్యావరణహితంగా మార్చాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. విపరీతమైన కాలుష్యంతో ఢిల్లీ, ముంబై, చెన్నై వంటి నగరాల్లో ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని... అటువంటి పరిస్థితి హైదరాబాద్ నగరంలో తలెత్తకూడదన్నారు. కోర్ సిటీలో ఉన్న కాలుష్యకారక పరిశ్రమలను ఓఆర్‌ఆర్ బయటకు తరలించాలని ఆదేశించారు. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖపై మంగళవారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ నగరాన్ని కాలుష్యరహితంగా మార్చేందుకు అవసరమైన సంస్కరణలు చేపట్టాలని... ఇందుకు రానున్న 25 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఇందుకుగానూ ఢిల్లీ, ముంబై, చెన్నై వంటి నగరాల్లో సమస్యలను అధ్యయనం చేయాలని పేర్కొన్నారు. నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, అండర్ గ్రౌండ్ కేబులింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో అన్ని శాఖలు సమగ్ర డిపిఆర్‌లు తయారు చేయాలని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలని... నిర్మాణ రంగ వ్యర్థాలను సిటీలో ఎక్కడపడితే అక్కడ డంప్ చేయకుండా చూడాలని ఆదేశించారు. ఉద్దేశపూర్వకంగా అలా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్ నగరంలో మంచినీటి సరఫరా, మురుగు నీటి సరఫరా వ్యవస్థను పూర్తిగా సంస్కరించాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందేలా హైదరాబాద్ నగర మంచినీటి సరఫరా.. సీవరేజీ బోర్డు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. బోర్డు తమకున్న వనరులను ఏ విధంగా సద్వినియోగం చేసుకోవాలనే అంశంపై ప్రత్యేక ప్రణాళిక రూపొంచుకోవాలని సూచించారు. ఓఆర్‌ఆర్ పరిధిలోని వారసత్వ కట్టడాల సంరక్షణ, వాటిని పర్యాటక ప్రదేశాలుగా తీర్చిదిద్దేందుకుగానూ కులీకుతుబ్ షాహీ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ మార్గదర్శకాలను సవరించి దానిని మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. మార్గదర్శకాల రూపకల్పనలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాతబస్తీలో మెట్రో పనుల పరిస్థితిపైనా సిఎం ఆరా తీశారు. అవసరమైన నిధులు ఇప్పటికే విడుదల చేసినందున అక్కడ అక్కడ మెట్రో పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. మెట్రో ఇతర ఫేజ్‌ల అనుమతులు, తదితర విషయాల్లో ఏ మాత్రం జాప్యాన్ని సహించబోమని హెచ్చరించారు. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖతో సమన్వయం చేసుకుంటూ త్వరగా పనులు పట్టాలెక్కేలా చూడాలని అధికారులకు సూచించారు. ప్యారడైజ్ జంక్షన్ నుంచి శామీర్ పేట ఓఆర్‌ఆర్ వరకు ఎలివేటేడ్ కారిడార్ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. మూసీ రివర్ ఫ్రంట్‌కు సంబంధించి హిమాయత్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఓఆర్‌ఆర్ నుంచి మూసీ వైపు వచ్చే క్రమంలో కొత్వాల్‌గూడ జంక్షన్‌లో మూసీ రివర్ ఫ్రంట్‌కు ప్రతీకగా ఇండియా గేట్, గేట్ వే ఆఫ్ ఇండియా, చార్మినార్ లాంటి ఓ ల్యాండ్ మార్క్‌ను నిర్మించాలని, మూసీపైన బ్రిడ్జి కం బ్యారేజీలకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. అనుమతులు, నిబంధనల విషయంలో తగు జాగ్రత్తలు వహించాలని అధికారులకు తెలిపారు. నెహ్రూ జూ పార్క్, మీరాలం ట్యాంక్ అభివృద్ధి పనుల్లో పురోగతిపైనా సమీక్షించారు. మీరాలం ట్యాంక్ ఎదుట ఏర్పాటు చేసిన ఎస్టీపీలు వాటి సామర్థ్యానికి అనుగుణంగా పని చేసేలా చూడాలని, జూ పార్క్, మీరాలం ట్యాంక్ సమీపంలో పర్యాటకులు బస చేసేందుకు వీలుగా అధునాతన వసతులతో హెూటల్ నిర్మించాలని... పార్క్, మీరాలం ట్యాంక్ తోపాటు నగరాన్ని వీక్షించేలా హోటల్ ఉండాలని అభిప్రాయపడ్డారు. సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి (హెచ్‌ఎండిఎ ఏరియా) కార్యదర్శులు ఇలంబర్తి, టి.కె.శ్రీదేవి, హెచ్‌ఎండిఎ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఎఫ్‌సిడిఏ కమిషనర్ కే.శశాంక, వాటర్ బోర్డు ఎండి అశోక్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్, మెట్రో రైలు ఎండీ ఎన్.వి.ఎస్.రెడ్డి, ఎంఆర్‌డిసిఎల్ ఎండీ ఇ.వి. నరసింహారెడ్డి, జెఎండి గౌతమి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక కేటగిరిగా గిరిజన తెగలను గుర్తించాలి

- గవర్నర్‌కు గిరిజన సంఘాల వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న 2027 జనాభా లెక్కల్లో గిరిజన తెగలకు సంబంధించి మతం కాలమ్‌లో షెడ్యూల్ ట్రైబ్ లేక ప్రకృతి ఆరాధకులుగా ప్రత్యేక కేటిరిగా గుర్తించాలని గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం, తెలంగాణ గిరిజన సంఘం నేతలు మాజీ పార్లమెంట్ సభ్యులు మిడియం బాబూరావు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, టిఎజిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్, ఉపాధ్యక్షులు బండారు రవికుమార్, టిజిఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం ధర్మానాయక్, ఆర్ శ్రీరాంనాయక్ గవర్నర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. రాష్ట్రంలో 33 తెగల గిరిజనులున్నారనీ, వీరు ప్రధానంగా ఐదో షెడ్యూల్ ప్రాంతంలో 1180 షెడ్యూల్డ్ గ్రామాలు, మైదాన ప్రాంతంలోని అన్ని జిల్లాల్లో నివసిస్తున్నారని తెలిపారు. ఆదివాసీ గిరిజన తెగల్లో కోయ, గోండి, కొలామి, లంబాడా, ఎరుకల భాషలను వారి సొంత మాండలికాల్లో మాట్లాడుతారని పేర్కొన్నారు. వీరు మాట్లాడే భాషలకు లిపి లేకపోవడం వల్ల వాటికి ఉనికి దెబ్బతింటున్నదని తెలిపారు. ఆదివాసీ గిరిజన తెగలు తరతరాలుగా పూర్వీకుల నుండి కొండలు, నదులు, చెట్లు, జంతువులు,ప్రకృతిని దైవంగా కొలుస్తారని గుర్తు చేశారు. ఇవి వారి వారి తెగల సంప్రదాయ మతపరమైన ఆచారాలుగా కొనసాగుతున్నాయని తెలిపారు. వీరు విగ్రహారాధన కాకుండా ప్రకృతినే ఆరాధ్య దైవంగా కొలుస్తారని పేర్కొన్నారు. తెగల సంస్కృతి, ఆచారాలు, క్రతువులు పాటిస్తూ ఇతర మతాల ఆచారాలకు దూరంగా ఉంటారని గుర్తు చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా వారు ఇతర మతాల ప్రభావంలో పడుతున్నారనీ, దీనివల్ల ఆదివాసి గిరిజన తెగల స్వంత సాంస్కృతిక, సామాజిక అస్థిత్వం ప్రమాదంలో పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఇప్పటివరకు జరిగిన జనాభా లెక్కల్లో ఇతర మతపరమైన ఆచారాలలో నమోదు చేయబడ్డారనీ, వారు వేర్వేరు ఆదివాసీ గిరిజన విశ్వాసాలు, ఆచారాలకు చెందినవారనే వాస్తవాన్ని ఇది అస్పష్టం చేస్తుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం 2027లో చేపడుతున్న జనాభా లెక్కల్లో మతం అనే క్యాటగిరిలో షెడ్యూల్ తెగలు, ప్రకృతి ఆరాధకులుగా ప్రత్యేక కాలమ్‌ను చేర్చేవిధంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు తగు సూచనలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. నాన్ షెడ్యూల్‌లో ఉన్న వెయ్యి గిరిజన గ్రామాలను షెడ్యూల్‌లో చేర్చాలని కోరారు. రాష్ట్రంలో ఐదో షెడ్యూల్ ప్రాంతానికి ఆనుకుని ఉన్న 50 శాతం నుండి 100శాతం గిరిజన జనాభా కలిగిన నాన్ షెడ్యూల్ గ్రామాలను షెడ్యూల్ ప్రాంతంలో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. ఈ గ్రామాల్లో గిరిజనులు ఐటిడిఎ పథకాలు పొందలేకపోతున్నారని తెలిపారు. వారి భూములకు 1/70, పీసా చట్టాలు అమలుకు నోచుకోవడం లేదని గుర్తు చేశారు. తెగ సర్టిఫికెట్ పొందడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

44 మంది డిప్యూటీ కలెక్టర్లకు ఉద్యోగోన్నతులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో 44 మంది డిప్యూటీ కలెక్టర్లకు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లుగా ఉద్యోగోన్నతి కల్పించడం పట్ల రెవెన్యూ ఉద్యోగ సంఘాల జెఎసి హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని బిఆర్.అంబేద్కర్ సచివాలయంలో జెఎసి చైర్మన్ వి.లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ సంఘాల నాయకులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా 33 సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పోస్టులను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందన్నారు. సీనియర్ అసిస్టెంట్ నుంచి నాయబ్ తహశీల్దార్ వరకు ఉద్యోగోన్నతులను కల్పించిందని చెప్పారు. రాష్ట్రంలోని 10,954 గ్రామాల్లో జిపిఒల నియామకంతో రెవెన్యూ వ్యవస్థ మరింత బలపడుతుందని అన్నారు. మంత్రిని కలిసిన వారిలో డిప్యూటీ కలెక్టర్ల సంఘం ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ, తహశీల్దార్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. రాములు, ప్రధాన కార్యదర్శి రమేష్ పాక, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బాణాల రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి వి. భిక్షం, తహశీల్దార్ల సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు రాధ, సెక్రటరీ జనరల్ పూల్ సింగ్ తదితరులు ఉన్నారు.



సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలి

- క్షేత్రస్థాయిలో క్యాంపులు నిర్వహించాలి
- టిజి శాక్స్ పిడి డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ వాసం వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో సీజనల్ వ్యాధులు నియంత్రించడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో మంగళవారం ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారి వాసం వెంకటేశ్వర్లు.. మహబూబాబాద్ జిల్లా బయ్యారం పిహెచ్‌సి కేంద్రాన్ని అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి పిహెచ్‌సిలో అందుతున్న వైద్యాన్ని, వివిధ విభాగాల సేవలను ప్రత్యేక అధికారికి తెలిపారు. బయ్యారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జఫ్ఫాబాద్ గ్రామాన్ని సందర్శించి అక్కడ డెంగ్యూ వచ్చిన వారి ఇళ్లను సందర్శించి వారికి ఏ విధమైన చికిత్స అందించారని తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. బయ్యారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి మందుల సరఫరా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అడ్మిట్ అయిన పేషెంట్లను విచారించి చికిత్స ఏ విధంగా అందిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. మహబూబాబాద్‌లోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌ను సందర్శించి ఫీవర్ వార్డు, ఫార్మసీ స్టోర్, ల్యాబ్, ఐసీటీసీ సెంటర్‌ను పరిశీలించారు. హాస్పిటల్ పరిసరాలు శుభ్రంగా ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా వైద్యాధికారి, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్, ప్రోగ్రాం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసం వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. బయ్యారం పిహెచ్‌సి కేంద్రంలో వైద్య సేవలు అందుతున్న తీరు బాగుందని, ఆస్పత్రి అంతా శానిటేషన్ నిర్వహణ చక్కగా ఉందన్నారు. ప్రజలందరికీ వ్యక్తిగత పరిశుభ్రత పై అవగాహన కల్పించి వైరస్ బారిన పడకుండా చూడాలన్నారు. జిల్లాను సంపూర్ణ ఆరోగ్య జిల్లాగా నిలిచే విధంగా అధికారులు పనిచేయాలన్నారు.

మానవ హక్కుల బలోపేతానికి కృషి

- ఎన్‌హెచ్‌ఆర్‌సికి సిఎస్ రామకృష్ణరావు వివరణ

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో మానవ హక్కుల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని సిఎస్ కె.రామకృష్ణరావు జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు వివరణ ఇచ్చారు. హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డి)లో మానవ హక్కులపై మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులతో కమిషన్ చైర్మన్ జస్టిస్ వి.రామసుబ్రమణియన్ సమీక్షించారు. హక్కుల ఉల్లంఘనలకు సంబంధించి ఎలాంటి ఘటనలు జరిగినా సర్కార్ తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం చేస్తున్నదని సిఎస్ తెలిపారు. ప్రభుత్వ శాఖల వారీగా హక్కుల ఉల్లంఘన జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటునట్టు తెలిపారు. తెలంగాణ హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్త, అదనపు డిజిపి చారుసిన్హా, మహిళా శిశుసంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి అనితా రామచంద్రన్, ప్రధాన అటవీ సంరక్షణాధికారి సి.సువర్ణ, ఎస్సీ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ కె.శిథిజా, పాఠశాల విద్యా కమిషనర్ నవీన్ నికోలస్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ బి. గోపి తమ విభాగాలకు సంబంధించి కమిషన్ అడిగిన ప్రశ్నలకు వివరణ ఇచ్చారు.

బిసి బిల్లు కోసం 72 గంటల నిరాహారదీక్ష

- ఆగస్టు 4 నుంచి 7 వరకు : ఎమ్మెల్సీ కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసిలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించడంతో పాటు విద్య, ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం 72 గంటల పాటు నిరాహార దీక్ష చేయనున్నట్టు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రకటించారు. మంగళవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో యునైటెడ్ పూలే ఫ్రంట్, బిసి సంఘాల నాయకులతో కలిసి ఆమె మీడియా సమావేశంలో మాట్లాడారు. ఆగస్టు నాలుగు ఉదయం 11 గంటల నుంచి ఏడవ తేదీ ఉదయం 11 గంటల వరకు ఇందిరాపార్క్‌లోని ధర్నాచౌక్‌లో నిరాహార దీక్ష చేస్తానని తెలిపారు. తెలంగాణ జాగృతి, యుపిఎఫ్ చేసిన పోరాటాలకు దిగివచ్చే రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ, కౌన్సిల్‌లో బిసిల కోసం రెండు వేర్వేరు బిల్లులు ప్రవేశపెట్టి ఆమోదించిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం వద్దకు అఖిలపక్షాన్ని తీసుకెళ్తామని అప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందే కానీ ఇంతవరకు ఆ ప్రయత్నం చేయలేదన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించిన ధర్నాను ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీనే పట్టించుకోలేదని ఎద్దేవా చేశారు. మళ్లీ కాంగ్రెస్ ధర్నా చేస్తాననడం వంచించడమేనని తెలిపారు. హైకోర్టు ఆదేశాల మేరకు గడువులోగా స్థానిక ఎన్నికలు నిర్వహించడం ఎంత ముఖ్యమో బిసిలకు రిజర్వేషన్ కోటా పెంచడం కూడా అంతే ముఖ్యమని కవిత అభిప్రాయపడ్డారు. రాష్ట్ర క్యాబినెట్ ఆమోదించిన సవరణ బిల్లుకు గవర్నర్ ఆమోదం తెలపకుంటే, రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఎందుకు న్యాయపోరాటం చేయలేదని ప్రశ్నించారు. ఇదే పరిస్థితి ఎదురైన తమిళనాడు ప్రభుత్వం న్యాయపోరాటం చేసి రిజర్వేషన్లు సాధించుకున్న విషయాన్ని కవిత ఈ సందర్భంగా ఉదహరించారు. ఆర్డినెన్స్ విషయంలో ఎందుకు న్యాయపోరాటం చేయడం లేదో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని కవిత డిమాండ్ చేశారు. బిసి రిజర్వేషన్ల పెంపునకు బిజెపి అడ్డు తగులుతోందని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రపతి బిల్లుకు ఆమోదం తెలపకపోతే మరోసారి శాసనసభ, శాసనమండలి ఆ బిల్లులకు ఆమోదం తెలిపి అమలు చేసుకోవచ్చని కవిత సూచించారు. బిసి రిజర్వేషన్లు పెంచి అమలు చేసుకునేందుకు ఎన్నో



అవకాశాలున్నా కేవలం పిఎం నరేంద్రమోడీని రక్షించేందుకే సీఎం రేవంత్ రెడ్డి కేంద్రంపై ఒత్తిడి తేవడం లేదని ఆరోపించారు. బిజెపితో ఉన్న ఒప్పందంతోనే రేవంత్ సర్కార్ కోర్టుకు వెళ్లడం లేదని దుయ్యబట్టారు. కేంద్రంపై ఒత్తిడి పెంచాలంటే వెంటనే హైకోర్టు, సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీకి వెళ్లి ధర్నా చేస్తాం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అంటున్నారనీ, ఢిల్లీలో ధర్నా అంటే అదేమైనా సత్రం భోజనమా అని ప్రశ్నించారు. మంత్రి పొన్నం బాధ్యతారాహిత్యంగా మాట్లాడు తున్నారని మండిపడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలో అంబేద్కర్ విగ్రహ సాధన కోసం 72 గంటల నిరాహార దీక్ష చేస్తే అప్పటి కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వం దిగివచ్చిందని గుర్తుచేశారు. బిసి బిల్లుల కోసం అదే తరహాలో నిరాహారదీక్ష చేస్తానని స్పష్టం చేశారు. నిరాహార దీక్షకు అనుమతి ఇవ్వకుంటే ఎక్కడ ఉంటే అక్కడే నిరాహారదీక్షకు చేస్తానని తెలిపారు.

త్వరలో నామినేటెడ్ పోస్టుల భర్తీ

- సిఎంతో చర్చించి తుది నిర్ణయం
- డిసిసి అధ్యక్షులతో మహేశ్‌కుమార్‌గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నామినేటెడ్ పోస్టులను భర్తీ చేస్తుందని పిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్ వెల్లడించారు. ఎఐసిసి ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, తాను రెండు రోజుల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి నామినేటెడ్ పోస్టులపై చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లోని హైదర్‌గూడ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో డిసిసి అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, జిల్లా ఇన్‌చార్జిలతో ఎఐసిసి ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. డిసిసి అధ్యక్షులు, మండల కమిటీల నియామకం, సంస్థాగత నిర్మాణం, స్థానిక సంస్థల ఎన్నికలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ సీఎంతో చర్చించిన వెంటనే ఆయా సంస్థల్లో ఉన్న నామినేటెడ్ సభ్యులను నియమిస్తామని చెప్పారు. నియోజకవర్గానికి ఇద్దరి చొప్పున నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలనే విజ్ఞప్తులు వస్తున్నాయని తెలిపారు. అందులో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు, మహిళలకు తగిన ప్రాధాన్యతను కల్పిస్తూ ఇప్పటికే జాబితా సిద్ధం చేసినట్టు తెలిపారు. ఆయా ప్రభుత్వ పదవుల్లో 50 ఏండ్లలోపు ఉన్న 60 శాతం మంది అభ్యర్థులకు తగిన ప్రాధాన్యత ఇస్తామని వెల్లడించారు.

బిసి రిజర్వేషన్ల కోసం ఢిల్లీలో ఉద్యమం

బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు ఢిల్లీ వెళ్లి కేంద్ర ప్రభుత్వంతో తేల్చుకుంటామని మహేశ్‌కుమార్ చెప్పారు. మరోవైపు గురువారం నుంచి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్ర, శ్రమదాన కార్యక్రమం చేపట్టనున్నట్టు తెలిపారు. వీటన్నింటిపై ముఖ్యమంత్రితో చర్చించి తుది రూపం ఇస్తామన్నారు. పదేళ్లపాటు పదవులను అనుభవించిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, గంగుల కమలాకర్‌కు అధికారం కోల్పోయిన తర్వాత బిసిలు గుర్తుకొస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎస్‌సి వర్గీకరణ, బిసిలకు రిజర్వేషన్లు కల్పించడం కాంగ్రెస్‌తోనే సాధ్యమని చెప్పారు.

టిఆర్‌పి కోసం మోడీ పాకులాట

టిఆర్‌పి పాపులారిటీ కోసం ప్రధాని మోడీ పాకులాడుతున్నారని టిపిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్ ఎక్స్‌లో పేర్కొన్నారు. మోడీ ఉపన్యాసాలు ఇస్తుంటే, ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ మాత్రం బాధల్లో ఉన్న ప్రజలకు అండగా నిలుస్తున్నారని తెలిపారు.

ప్రతి పేదవాడికీ ఇందిరమ్మ ఇల్లు

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

ప్రజా సమస్యలు పరిష్కరించడమే నాయకుడి లక్ష్యమని, ప్రతి పేదవానికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డితో కలిసి డిప్యూటీ సిఎం రూ.275 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టారు. రూ.250 కోట్లతో చేపట్టే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల, రూ.25 కోట్లతో తాండూర్ పరిధిలో ఆరు 33/11 కెవి సబ్ స్టేషన్లు, పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. లబ్దిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేశారు. అనంతరం కందనెల్లి జీపీఆర్ ఫంక్షన్ హాల్లో జరిగిన సభలో డిప్యూటీ సిఎం మాట్లాడారు. రాష్ట్రంలో కోటి 20 లక్షల కుటుంబాలకుగాను 95 లక్షల కుటుంబాలకు రేషన్ కార్డులు అందిస్తున్నట్టు తెలిపారు. ప్రతి నియోజకవర్గానికీ మొదటి విడతగా 3,500 ఇళ్లు మంజూరు చేశామన్నారు. 25 ఎకరాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఇలాంటి పాఠశాలలు భవిష్యత్ తరాలకు ఎంతగానో దోహదపడుతాయని చెప్పారు. మహిళల ఆర్థిక అభివృద్ధికి వడ్డీ లేని రుణాలు అందజేశామన్నారు. ఏడాదిలోనే రూ.21 వేల కోట్ల రుణాలు అందించిన ఘనత కాంగ్రెస్‌దే అన్నారు. జనాభా ప్రాతిపదికన బహుజనుల రిజర్వేషన్ 42 శాతానికి పెంచుతూ ప్రభుత్వ తీర్మానాన్ని కేంద్రానికి పంపించామన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ.. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. కోటపల్లి ప్రాజెక్టు అభివృద్ధికి రూ.90 కోట్లు మంజూరైనట్టు తెలిపారు. ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు పొందేందుకు రేషన్ కార్డు ఎంతగానో దోహదపడుతుందన్నారు. రాష్ట్రంలో 75 వేల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత తమ ప్రభుత్వనిదేనని చెప్పారు. వికారాబాద్ నుంచి తాండూర్ వరకు రూ.63 కోట్లతో రోడ్ల నిర్మాణాలు చేపట్టామన్నారు. ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. వికారాబాద్ జిల్లాలో కొత్తగా 22,503 రేషన్ కార్డులు మంజూరైనట్టు తెలిపారు. తాండూరు నియోజకవర్గ అభివృద్ధికి మరిన్ని నిధులు కావాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మంత్రులను కోరారు.

విద్యా రంగంలో పారదర్శకతకు ప్రాధాన్యం

- టిజిఎడబ్ల్యూఆర్‌ఐఐఎస్ కార్యదర్శి అలగు వర్షిణి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తోందనీ, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లోని అన్ని పాఠశాలల్లో ప్రవేశాలన్నీ మెరిట్ ఆధారంగా జరుగుతున్నాయని టిజిఎస్‌డబ్ల్యూఆర్‌ఐఎస్ కార్యదర్శి డాక్టర్ విఎస్ అలగు వర్షిణి స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని డిఎస్ఎస్ భవన్‌లో ఆమె విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సాంఘిక సంక్షేమ గురుకులాల్లో ఐదో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు అన్ని సీట్లు ఇప్పటికే భర్తీ అయ్యాయని తెలిపారు. ప్రామాణికమైన పరీక్షల ద్వారా తయారైన మెరిట్ జాబితాల ప్రకారమే ఎంపికలు జరిగాయని వివరించారు. "తల్లిదండ్రులు ఎవరూ మోసపోవద్దు. సీటు కోసం ఎవరికైనా డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదు. ఎవ్వరూ సీటు కల్పించలేరు, మెరిట్‌కు మాత్రమే సీటు దక్కుతుందని". అని ఆమె స్పష్టం చేశారు. ఖాళీగా ఉన్న ఇంటర్మీడియట్ కోర్సులకు జూలై 31న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్టు తెలిపారు. బుధవారం నుంచి అధికారిక వెబ్‌సైట్‌లో ఖాళీ సీట్ల జాబితా ఉంచుతామని చెప్పారు. అభ్యర్థులు దరఖాస్తు చేసేటప్పుడు పదో తరగతి మార్కుల మెమో, బర్త్ సర్టిఫికెట్ లేదా ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్, కులం, ఆదాయ ధృవీకరణ పత్రాలను సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఆదాయ పరిమితి గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.5 లక్షలు, పట్టణాల్లో రూ.2 లక్షల లోపుగా ఉండాలని సూచించారు.

సీబీఎస్‌ఈ,ఐసీఎస్‌ఈ సహా ఇతర గుర్తింపు పొందిన బోర్డుల విద్యార్థులు కూడా అర్హులేనని తెలిపారు. ప్రవేశాల విధానంలో 75 శాతం సీట్లు ఎస్సీ విద్యార్థులకు, 25 శాతం ఇతర వర్గాలకు కేటాయించినట్టు వెల్లడించారు. మెరిట్ ప్రకారం అర్హులైన వారికీ ప్రాతినిధ్యం కల్పించడమే తమ లక్ష్యమని ఆమె వివరించారు. ప్రత్యేక పరిస్థితుల్లో అర్హత ఉన్న విద్యార్థులకు మాత్రమే, సంబంధిత జిల్లా స్థాయి కమిటీల అనుమతి మేరకు అవసరమైన ధృవపత్రాలతో ప్రవేశాలు కల్పిస్తామని చెప్పారు. సంక్షేమ గురుకులాల్లో విద్యార్థులకు ఆహార సరఫరా వ్యవస్థలో సంస్కరణలు చేపట్టినట్టు వెల్లడించారు. పిల్లలకు నాణ్యమైన, పోషకాహార భోజనాలు అందించేందుకు కేంద్రీకృత కొనుగోలు విధానాన్ని (సెంట్రలైజడ్ ప్రొక్యూర్మెంట్ పాలసీ) రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని తెలిపారు. కొత్త విధానంలో జిల్లా కలెక్టర్ల సమక్షంలో, జిల్లా కొనుగోలు కమిటీల పర్యవేక్షణలో డైట్ ప్రొవిజన్స్, కూరగాయలు వంటి వస్తువులు జిల్లా స్థాయిలో కొనుగోలు చేస్తారన్నారు . మాంసం వంటి వస్తువుల కోసం మండల స్థాయిలో టెండర్లు నిర్వహిస్తారనీ, అర్హత కలిగిన టెండర్లలో లాటరీ విధానాన్ని అనుసరించి విక్రేతల ఎంపిక జరుగుతుందని తెలిపారు. కొనుగోలు ప్రక్రియలో స్థానిక మహిళా సంఘాలు, మండల మహిళా సమాఖ్యలు, యువజన సంఘాలను భాగస్వాములుగా చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు.



హైదరాబాద్‌లో ఎజిలెంట్ బయోఫార్మా సెంటర్ ఏర్పాటు

హైదరాబాద్ : లైఫ్ సైన్సెస్, డయాగ్నస్టిక్స్ రంగంలో ప్రపంచ అగ్రగామి సంస్థ ఎజిలెంట్ టెక్నాలజీస్ హైదరాబాద్‌లో తమ కొత్త బయోఫార్మా ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. మంగళవారం దీనిని తెలంగాణ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎజిలెంట్ సిఇఒ ప్రాడ్రిగ్ మెక్‌డొనెల్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ కేంద్రం దేశంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న లైఫ్ సైన్సెస్ రంగంలో భారీ పెట్టుబడులకు నిదర్శనమని మెక్‌డొనెల్ పేర్కొన్నారు. ఔషధ అభివృద్ధి ప్రక్రియను వేగవంతం చేయడం, అధిక నాణ్యత గల ఔషధాలను సమర్థవంతంగా అందించడంపై ఈ సెంటర్ దృష్టి కేంద్రీకరిస్తుందన్నారు.

సింగపూర్ కంపెనీతో ఎంఐసి ఒప్పందం



హైదరాబాద్ : స్మార్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఎలక్ట్రానిక్స్ తయారీలో ఉన్న సింగపూర్‌కు చెందిన నీఓ సెమీ ఎస్‌జి ప్రయివేటు లిమిటెడ్‌తో ఎంఐసి ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపింది. ఈ భాగస్వామ్యం ద్వారా తమకు సెమీకండక్టర్, ఎఐ అధారిత ఎనర్జీ రంగాల్లోకి ప్రవేశించేందుకు వీలు కలిగిందని ఎంఐసి పేర్కొంది. 'నీఓ సెమీకి చెందిన డీప్ టెక్ సామర్థ్యాలతో కలిసి, ఎంఐసి స్మార్ట్, సస్టెనబుల్ టెక్నాలజీ తయారీలో నాయకత్వం వహిస్తుంది." అని ఎంఐసి ఎలక్ట్రానిక్స్ సిఇఒ రక్షిత్ మాథుర్ పేర్కొన్నారు.

ప్రభుత్వ భూమిని ప్రయివేటుకు కట్టబెట్టే కుట్ర

- ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీ రోడ్ నెంబర్ 12లోని రూ.వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని ప్రయివేటు రియల్ ఎస్టేట్ సంస్థలకు కట్టపట్టే కుట్ర పన్నారని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ విమర్శించారు. ఇందుకోసం అక్కడి 70 ఏళ్ల నాటి పెద్దమ్మ తల్లి గుడిని విధ్వంసం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ కుట్రను ఎదుర్కొని గుడి చుట్టూ ఉన్న స్థలాన్ని అక్రమంగా ఆక్రమించాలనే యత్నాలు అడ్డుకుంటామని ఆయన హెచ్చరించారు. స్థానిక ప్రజలతో కలసి పోరాడుతున్న కార్పొరేటర్ వెంకటేష్‌ను అడ్డుకునే క్రమంలో పోలీసులు వరుసగా హౌస్ అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన మండిపడ్డారు. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కార్పొరేటర్ వెంకటేష్‌ను శ్రవణ్ కలుసుకుని సంఘీభావం తెలిపారు. గుడి కబ్జాను ఎట్టి పరిస్థితిలో బీఆర్ఎస్ సహించదని హెచ్చరించారు. గుడి తిరిగి నిర్మించేంత వరకు పోరాడుతామని ప్రకటించారు. ప్రభుత్వ భూమిలో ఇందిరమ్మ ఇళ్లు, ప్రభుత్వాస్పత్రి, ప్రభుత్వ స్కూలు నిర్మించాలని డిమాండ్ చేశారు.

నగరంలో జెఎల్ఆర్ కొత్త లగ్జరీ షోరూం ప్రారంభం

హైదరాబాద్ : టాటా గ్రూపునకు చెందిన ప్రముఖ లగ్జరీ కార్ల తయారీ కంపెనీ జాగ్వర్ లాండ్ రోవర్ (జెఎల్ఆర్) హైదరాబాద్‌లో తన కొత్త బోటిక్ షోరూమ్‌ను ప్రారంభించినట్లు వెల్లడించింది. బంజారాహిల్స్‌లో దీన్ని మెస్సర్స్ ప్రైడ్ మోటార్స్ భాగస్వామ్యంతో ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. ప్రత్యేకంగా రేంజ్ రోవర్, డిఫెండర్ బ్రాండ్‌ల కోసమే దీన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. జెఎల్ఆర్ ప్రస్తుతం భారత్‌లో 22 నగరాల్లో 27 అవుట్‌లెట్‌ను కలిగి ఉంది.

పేదలదే విజయం

- కోర్టు తీర్పులూ వారి పక్షమే
- విజయతీరాల్లో 35 ఏళ్ల కప్పాడు భూ పోరాటం
- ప్రభుత్వం పట్టా సర్టిఫికెట్లు జారీ చేయాలి
- భూ పోరాటాన్ని నడిపింది ఎర్రజెండా
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ
- కప్పాడు భూములో జెండా పాతిన జాన్‌వెస్లీ



కప్పాడు భూములను ట్రాక్టర్‌తో దున్నుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'35 యేళ్ల కప్పాడు భూ పోరాటంలో పేదలదే విజయం.. నాటి నుంచి కాస్తులో ఉండి సాగు చేసుకున్నారు. బినామీ భూస్వామి సుదర్శన్‌రెడ్డి అన్ని కోర్టుల్లో కేసు వేశారు.. జిల్లా కలెక్టర్, హైకోర్టు, సుప్రీంకోర్టు వరకూ అన్ని కేసుల్లోనూ పేదలు విజయం సాధించారు. తీర్పు పేదల పక్షం రావడంతో కేసులు వేసిన బినామీ భూస్వామి తోక ముడవక తప్పలేదు. ఈ భూమి మనదే.. రాష్ట్ర ప్రభుత్వం పట్టాలు జారీ చేయాలి.. హక్కులు కల్పించాలి.. పట్టాలు వచ్చే వరకూ సమిష్టి ఉద్యమాన్ని కొనసాగించాలి' అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పేదలకు పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కప్పాడులోని సర్వేనెంబర్ 197 నుంచి 263 వరకు ఉన్న 14 సర్వే నెంబర్లలోని 98.20 ఎకరాల మిగులు భూముల్లోకి జిల్లా కార్యదర్శి పి.యాదయ్య, జిల్లా నాయకత్వంతో కలిసి జాన్‌వెస్లీ ట్రాక్టర్లతో భూమిని దున్నారు.. సాలు పెట్టారు.. విత్తనాలు వేశారు.. ఎర్రజెండాలు పాతారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 35 యేళ్లుగా సాగుచేసుకుంటున్న పేదలకు రాష్ట్ర ప్రభుత్వం హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ భూములు తనవే అనుకున్న భూస్వామి పని అయిపోయిందని, ఇక పోట్లాడాల్సింది ప్రభుత్వంతోనేనని స్పష్టం చేశారు. బినామీ పేర్లతో ఈ భూమిని కాజేయాలని చూసిన సుదర్శన్ రెడ్డి (బుచ్చిరెడ్డి)కి ఈ భూమిపై ఎలాంటి సంబంధమూ లేదన్నారు. సుమారు రూ.200 కోట్ల విలువ చేసే ఈ భూములను కాజేసేందుకు సుదర్శన్‌రెడ్డి కుట్ర పన్నినట్టు చెప్పారు. అన్ని కోర్టుల్లోనూ ఓడిపోయినా ఇంకా ఎందుకు భూమిపై ఆశలు పెట్టుకున్నావని ప్రశ్నించారు. 98.20 ఎకరాల భూమి మిగులుదిగా కోర్టులు తేల్చాయన్నారు. ఎర్రజెండా నాయకత్వంలో భూములు సాధించామని తెలిపారు. మిగులు భూముల జోలికి వస్తే సుదర్శన్‌రెడ్డి కింద ఉన్న మరో 100 ఎకరాల భూముల్లో కూడా ఎర్రజెండాలు పాతి స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ పేదల పక్షమే తీర్పు ఇచ్చారని, హైకోర్టు పేదల పక్షమే తీర్పు ఇచ్చిందని, చివరికి సుప్రీంకోర్టు కూడా జిల్లా కలెక్టర్ ఇచ్చిన తీర్పునే అమలు చేయాలని సూచించిందని స్పష్టం చేశారు. భూములు పోతాయన్న భయంతో తన కొడుకుల పేరు మీద పట్టాలు చేసిన భూస్వామిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ భూములకు పట్టా సర్టిఫికెట్లు జారీ అయ్యే వరకూ సమిష్టిగా ఉద్యమించాలని సూచించారు. అవసరమైతే జిల్లా కలెక్టరేట్ వరకు పాదయాత్రగా తరలిరావాలని అన్నారు. కప్పాడు పోరాటాన్ని 35 ఏళ్లపాటు కొనసాగించిన యోధులకు విప్లవ అభినందనలు తెలిపారు. విజయం చివరి అంచుల్లో నిలిచామని, ఫలితాన్ని అందుకునేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.సామెల్, కె.భాస్కర్, కె.జగన్, డి.జగదీష్, రామ్‌చందర్, జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ బుగ్గ రాములు, సిహెచ్ జంగయ్య, డి.కిషన్, పి.జగన్ తదితరులు ఉన్నారు.

స్కూల్ వ్యాన్ కింద పడి చిన్నారి మృతి

- భూపాలపల్లి జిల్లా అంబటిపల్లిలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అప్పటిదాకా ఆటపాటలతో సంతోషంగా గడిపిన చిన్నారి.. ఓ స్కూల్ వ్యాన్ కింద పడి మృతి చెందింది. ఈ సంఘటన జయశంకర్-భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం అంబటిపల్లి గ్రామంలో మంగళవారం జరిగింది. ఎస్ఐ పవన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. అంబటిపల్లికి చెందిన సింగనేని మల్లేష్, భాగ్య దంపతుల కూతురు శ్రీహర్షిణి (3). సూరారానికి చెందిన ఎస్ఎస్‌వి స్కూల్ బస్సు విద్యార్థులను ఎక్కించుకునేందుకు అంబటిపల్లికి వచ్చింది. శ్రీహర్షిణి అన్నను బస్సులో ఎక్కించగానే బస్సు బయలుదేరింది. ఇదే సమయంలో డ్రైవర్ నిర్లక్ష్యంతో చిన్నారి పైనుంచి బస్సు వెళ్లింది. దాంతో శ్రీహర్షిణి మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న యాదవ సంఘం నాయకులు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సూరారం గ్రామపంచాయతీలో యాజమాన్యంతో సంఘ నాయకులు చర్చలు జరపగా.. పాఠశాల యజమాన్యం రూ.13 లక్షలు పరిహారం ఇచ్చేందుకు ఒప్పుకుంది. తక్షణ సాయంగా రూ.లక్ష, మిగతా డబ్బులు 11వ రోజు లోపు ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహాదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

పెద్ది విజయ దుర్గ మృతికి వ్యకాస, రైతు సంఘం నేతల సంతాపం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నిజామాబాద్ జిల్లా కార్యదర్శి, రాష్ట్ర ఉపాధ్యక్షులు పెద్ది వెంకట్రాములు సతీమణి విజయ దుర్గ అనారోగ్యతో మంగళవారం మరణించారు. విజయ దుర్గకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆమె మృతి వెంకట్రాములు కుటుంబానికి తీరని లోటు అని వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం నాయకులు పేర్కొన్నారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య, ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.ప్రసాద్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్‌రావు, ప్రధాన కార్యదర్శి టి.సాగర్ వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలిపారు. విజయ దుర్గ యువజన, మహిళ ఉద్యమాల్లో పాల్గొన్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్ గుండాల భౌతికదాడులు, బెదిరింపుల సమయంలో వెంకట్రాములుకు అండగా నిలబడిందని తెలిపారు. సిపిఎం రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు నల్లగొండ జిల్లా నరసింహుల గూడెం నుంచి హైదరాబాద్ మకాం మార్చారనీ, ఆ తర్వాత నిజామాబాద్ జిల్లా ప్రజాతంత్ర ఉద్యమ నిర్మాణం కోసం అక్కడకు వెళ్లారని పేర్కొన్నారు. అక్కడ గీత వృత్తిదారులను ఆర్గనైజ్ చేసే విషయంలో భర్తకు విజయదుర్గ చేయూతనిచ్చిందనీ, తన ఇంటికి వచ్చే కార్యకర్తలను ఆదరించడంతో పాటు ఆపదలో ఉన్న వారికి అండగా నిలబడేదని తెలిపారు.

విజయదుర్గ మృతి బాధాకరం : బి.వెంకట్

సుదీర్ఘకాలం పాటు వెంకట్రాములు కుటుంబంతో తనకు అనుబంధం ఉందనీ, విజయదుర్గ అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలిసి ఇటీవలే నిజామాబాద్ వెళ్లి పరామర్శించానని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ తెలిపారు. ఆమె మృతికి సంతాపం ప్రకటించారు.

నాణ్యమైన విద్యతోనే దేశాభివృద్ధి

- ప్రముఖ క్రికెటర్ కపిల్ దేవ్
- ముచ్చింతల్ పాఠశాలలో అదనపు తరగతి గదులు ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న కపిల్‌దేవ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నాణ్యమైన విద్యతోనే దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని ప్రముఖ క్రికెటర్ కపిల్ దేవ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం ముచ్చింతల్ మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో మై హోమ్ గ్రూప్, జూపల్లి బాలమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించిన 12 అదనపు తరగతి గదులను మంగళవారం జెబిఎం ట్రస్ట్ డైరెక్టర్ జూపల్లి జగపతిరావుతో కలిసి కపిల్ దేవ్ ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా విద్యాధికారి సుశీందర్ రావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదువుకుని దేశం గర్వించదగ్గ స్థాయికి ఎదగాలన్నారు. విద్య ద్వారానే పేదరిక నిర్మూలన సాధ్యమని తెలిపారు. గతేడాది ఈ పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి హాజరయ్యానని గుర్తు చేశారు. అప్పటికి, ఇప్పటికీ పాఠశాల స్వరూపమే మారిపోయిందని సంతోషం వ్యక్తం చేశారు. పాఠశాల అభివృద్ధికి మై హోమ్ గ్రూప్ కుటుంబ సభ్యులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. విద్యార్థులు ప్రాంతీయ భాషలతో పాటు జాతీయ, అంతర్జాతీయ భాషలు నేర్చుకోవాలని సూచించారు. తన సంస్థ ఖుషి ఫౌండేషన్ ద్వారా పాఠశాలకు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

మై హోమ్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ జూపల్లి జగపతిరావు మాట్లాడుతూ.. తన సోదరుడు మై హోమ్ గ్రూప్ చైర్మన్ జూపల్లి రామేశ్వరరావు సంకల్పంతో ఈ పాఠశాలను దత్తత తీసుకున్నట్టు తెలిపారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. త్వరలో గ్రామంలో 250 పడకల ఆస్పత్రిని నిర్మిస్తామన్నారు. ముచ్చింతల్ ప్రభుత్వ పాఠశాలను తమ ట్రస్టు ద్వారా దేశంలోనే ఒక ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దుతామని తెలిపారు. డిఇఒ మాట్లాడుతూ.. గతేడాది 78 మంది విద్యార్థులు ఉన్న ఈ పాఠశాల.. జూపల్లి జగపతిరావు ప్రత్యేక చొరవతో 1,160కి చేరిందన్నారు. పాఠశాల ప్రారంభమైన ఒకేరోజు 800 మందిపైగా విద్యార్థులు చేరడం చారిత్రాత్మకమని తెలిపారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా 9 మంది ప్రభుత్వ టీచర్లను డిప్యూటేషన్‌పై పంపినట్టు తెలిపారు. ప్రస్తుతం 22 మంది ప్రభుత్వ, ప్రయివేటు టీచర్లతో బోధన జరుగుతుందన్నారు. సైంటిస్ట్ సతీష్‌రెడ్డి మాట్లాడుతూ.. 'కలలు కనండి-కలలు సహకారం చేసుకోండి' అన్న డాక్టర్ అబ్దుల్ కలాం ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. ఆర్‌టిసి ఎండి సజ్జనార్ మాట్లాడుతూ.. విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు. పాఠశాల వరకు అదనపు బస్సులు నడుపుతామని తెలిపారు.

ఎన్ఐఇపిఐడిలో మొక్కలు నాటిన డిప్యూటీ సిఎం భట్టి



ప్రజాశక్తి-హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ బోయిన్‌పల్లి మనోవికాస్ నగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటెలెక్చువల్ డిసేబిలిటీస్ (ఎన్ఐఇపిఐడి) ప్రాంగణంలో మంగళవారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేష్‌తో కలిసి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ కోసం స్వచ్ఛంద సంస్థలు చేపడుతున్న చర్యలు ప్రశంసనీయమన్నారు. వికలాంగులు విద్యాబుద్ధులు నేర్చుకుంటున్న ఎన్ఐఇపిఐడి సంస్థలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వ సహకారంతో వికలాంగుల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఎన్ఐఇపిఐడి ప్రతినిధులు, సంస్థ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ముస్లిముల రిజర్వేషన్లపై బిజెపిది ద్వంద్వ వైఖరి

- మాజీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుపై బిజెపి నాయకుల వ్యాఖ్యలు దురుద్దేశపూరితంగా ఉన్నాయని మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి విమర్శించారు. కరీంనగర్ జిల్లాలో సూడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డితో కలిసి ఆయన మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముస్లిముల రిజర్వేషన్లపై బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఒకలా, తెలంగాణలో ఒకలా బిజెపి నాయకులు ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నారని విమర్శించారు. బిజెపి పాలిత గుజరాత్, మహారాష్ట్రలో ముస్లిముల రిజర్వేషన్లు అమలవుతుండగా.. ఇక్కడ మాత్రం ఆ పార్టీ నాయకులు వ్యతిరేకిస్తున్నారని అన్నారు. "రాజ్యాంగం ప్రకారం సామాజిక వెనుకబాటుకు గురైన తరగతులకు రిజర్వేషన్లు కల్పించాలి. మతపరమైన రిజర్వేషన్ కాదు.. వెనుకబాటును ఆధారంగా చేసుకుని రిజర్వేషన్లు అమలు చేస్తున్నాం.." అని చెప్పారు. 56 శాతం జనాభా వెనుకబాటుతో ఉన్నట్టు డెడికేటెడ్ కమిషన్ నివేదిక ఇచ్చిందన్నారు. అందులో 10 శాతం ముస్లిం జనాభా కూడా ఉందని గుర్తు చేశారు. కానీ బిజెపి నాయకులు మతం పేరిట తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. బలహీన వర్గాల రిజర్వేషన్ బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చేందుకు కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచందర్‌రావు వంటి నేతలు ప్రధాని, హోంమంత్రిపై ఒత్తిడి తెచ్చి చొరవ చూపాలని కోరారు.




విద్యాభివృద్ధికి విశ్వవిద్యాలయాల తోడ్పాటు

- రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర సాధనలో చురుకైన పాత్ర పోషించిన విశ్వవిద్యాలయాలు విద్యారంగం అభివృద్ధిలోనూ తోడ్పడాలని రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయాన్ని మంగళవారం విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, కమిషన్ సభ్యులు ఆచార్య పిఎల్.విశ్వేశ్వరరావు, డా చారకొండ వెంకటేష్, జ్యోత్స్న, శివారెడ్డి సందర్శించారు. వివిధ విభాగాల్లో మౌలిక వసతులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ప్రస్థానం, ప్రస్తుత స్థితిగతులపై ఉపకులపతి ఆచార్యఖాజా అల్తాఫ్ హుస్సేన్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం విశ్వవిద్యాలయ అధ్యాపక, బోధనేతర సిబ్బంది, విద్యార్థులతో 'ప్రజా విచారణ' చేపట్టారు. ఈ సందర్భంగా ఆకునూరి మురళి మాట్లాడుతూ.. విద్య అభ్యున్నతి, దీర్ఘకాలిక ప్రయోజనాలను అందించే ఉత్తమ సాధనంగా.. నైపుణ్యాలను అందించి నైతికత, సమతా భావన, దేశభక్తిని పెంపొందించే గురుతర బాధ్యత విశ్వవిద్యాలయాలపై ఉందన్నారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థి సంఘాల నాయకులు, ప్రయివేటు కళాశాలల యాజమాన్యాలతో అధికారులు చర్చించారు.

తమ కళాశాలలు, క్రీడా సదుపాయాలు, హాస్టల్లో సమస్యలపై విద్యార్థులు కమిషన్‌కు వివరించారు. సదుపాయాలతోపాటు పోటీ పరీక్షల సమాయత్తానికి వెసులుబాటు కల్పించాలని కోరారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నాలుగేండ్ల బకాయిల వల్ల తాము ఎదుర్కొంటున్న సమస్యలను ప్రయివేటు కళాశాలల యాజమాన్యాలు కమిషన్ దృష్టికి తీసుకొచ్చాయి. కాంట్రాక్ట్, పార్ట్ టైం అధ్యాపకులు తమ సమస్యలను వివరిస్తూ.. సర్వీసుల క్రమబద్ధీకరణతోపాటు, సర్వీస్ గుర్తింపు ద్వారా న్యాయం చేయాలని కోరారు. మూడు అంచల వేతన విధానం ద్వారా నష్టపోతున్నామని, అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ విధానాన్ని రద్దు చేయాలని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు విన్నవించారు.



సదస్సులో మాట్లాడుతున్న మిడియం బాబూరావు

జనగణనలో ఆదివాసులకు ప్రత్యేక కాలమ్ కావాలి

- మాజీ ఎంపి డాక్టర్ మిడియం బాబూరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జనగణనలో ఆదివాసులకు ప్రత్యేక కాలమ్ కేటాయించాలని మాజీ ఎంపి డాక్టర్ మిడియం బాబూరావు ప్రభుత్వాలను కోరారు. ఆదివాసులను హిందూ మతంలో విలీనం చేయాలన్న కుట్రను గుర్తించాలని, అది రాజకీయ లక్ష్యాలతో కూడినదని అన్నారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంఘం పూసం సచిన్ అధ్యక్షతన 'జనగణనలో షెడ్యూల్ ట్రైబ్స్‌కు కాలమ్ కేటాయించాలి' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదివాసులను హిందూ మతంలో విలీనం చేయాలన్న ప్రయత్నం పూర్తిగా రాజకీయ లక్ష్యంతో కూడినదనే విషయాన్ని గ్రహించాలని సూచించారు. ఆదివాసులు చారిత్రకంగా గ్రామ, కుల వ్యవస్థకు దూరంగా అడవుల్లో జీవించారని, క్రమంగా వారు తమ భాష, మతం, సంస్కృతిని ఏర్పరచుకుని ప్రత్యేకతను నిలబెట్టుకున్నారని తెలిపారు. వారి పోరాటంలో వారి చరిత్రే ఆయుధంగా ఉందన్నారు. వారి ప్రత్యేక మత, భాష, సంస్కృతి ఉనికిని తొలగించడాన్ని వారి చరిత్రను చెరిపివేసే ప్రయత్నంగా చూడాల్సి ఉంటుందన్నారు. రాష్ట్రంలో 33 షెడ్యూల్ తెగలు ఉన్నాయని, వీరి జనాభా సుమారు 33 లక్షలని వివరించారు. వీరిలో కోయ, గోండి, కొలామీ, లంబాడా, ఎరుకల భాషలు మాట్లాడేవారు ఉన్నారన్నారు. వీరి భాషలకు లిపి లేకపోవడం వల్ల మనుగడ ప్రమాదంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా ఐదో షెడ్యూల్ ప్రాంతంలో 1180 షెడ్యూల్డ్ గ్రామాలు, మైదాన ప్రాంతంలోని అన్ని జిల్లాల్లో నివసిస్తున్నారని తెలిపారు. తరతరాలుగా గిరిజన తెగలు కొండలు, నదులు, చెట్లు, జంతువులను దైవంగా భావిస్తూ, ప్రకృతినే ఆరాధ్యదైవంగా కొలుస్తూ వస్తున్నారని తెలిపారు. విగ్రహారాధనకు దూరంగా, తమ సంప్రదాయ ఆచారాలు పాటిస్తూ.. ఇతర మతాలకు దూరంగా ఉంటున్నారని చెప్పారు. ఇటీవల ఇతర మతాల ప్రభావంతో వీరి సొంత సంస్కృతి, సామాజిక అస్థిత్వం ప్రమాదంలో పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు జరిగిన జనాభా లెక్కల్లో గిరిజనులు ఇతర మతాల్లో నమోదయ్యారని, ఇది వారి ప్రత్యేక మత విశ్వాసాలను అస్పష్టంగా చూపుతోందని అన్నారు. 2027 జనాభా లెక్కల్లో మతం కేటగిరీలో "షెడ్యూల్ తెగలు" లేదా "ప్రకృతి ఆరాధకులు" అనే ప్రత్యేక కాలమ్ చేర్చాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు రవికుమార్, ఎర్మ పున్నం, సహాయ కార్యదర్శులు ఆత్రం తనుష్, తొడసం శంబు, కోరెంగా మాలశ్రీ, దుగ్గి చిరంజీవి, అశోక్, భాగల రాజన్న తదితరులు పాల్గొన్నారు.

కెజిబివి విద్యార్థులకు బూట్లు, స్పోర్ట్స్ కిట్ కూడా..

- రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల (కెజిబివి)ల్లో చదువుతున్న విద్యార్థులకు బూట్లు (షూ) ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. స్పోర్ట్ కిట్ కూడా ఇచ్చేందుకు అంగీకరించింది. ప్రస్తుత విద్యాసంవత్సరం (2025-26)లోనే విద్యార్థులకు బూట్లు, స్పోర్ట్స్ కిట్ ఇవ్వనుంది. సమగ్ర శిక్ష పథకంలో భాగంగా కెజిబివిల్లోని విద్యార్థులకు బూట్లు ఇవ్వాలంటూ కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. దానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీంతో ప్రస్తుత విద్యాసంవత్సరంలో విద్యార్థులకు బూట్లతో పాటు స్పోర్ట్స్ కిట్ కూడా అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో 31 జిల్లాల్లో 495 కెజిబివిలున్నాయి. వాటిలో ఆరు నుంచి 12వ తరగతి వరకు 1,24,153 మంది విద్యార్థులు చదువుతున్నారు.

సమగ్ర శిక్ష పథకంలో ఉన్న కెజిబివిలకు అయ్యే ఖర్చులో కేంద్రం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులను భరిస్తాయి. విద్యాపరంగా వెనుకబడిన జిల్లాల్లో కెజిబివిలను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ పథకం ద్వారా అమ్మాయిల విద్యను ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయి. విద్యార్థులకు రెసిడెన్షియల్‌లో విద్యనందిస్తాయి. వారికి ఉచితంగా భోజనం, వసతితోపాటు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫారాలను అందిస్తాయి. ఇప్పుడు అమ్మాయిలకు బూట్లతోపాటు స్పోర్ట్స్ కిట్ కూడా అందనుంది. అమ్మాయిలకు పూర్తిస్థాయిలో రక్షణ ఉంటుంది. సీసీ కెమెరాల నిఘా ఉంటుంది. మహిళా సిబ్బంది మాత్రమే పనిచేస్తారు. రాత్రిపూట వాచ్‌వుమెన్ కూడా అందుబాటులో ఉంటారు. విద్యార్థులు చదువుల్లో మరింత రాణించాలని విద్యాశాఖ అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



క్రెడాయ్ తెలంగాణ కమిటీ చైర్మన్‌గా ప్రేమ్‌సాగర్‌రెడ్డి

- అధ్యక్షులుగా ఇంద్రసేన రెడ్డి నియామకం

ప్రజాశక్తి - హైదరాబాద్

కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) తెలంగాణ నూతన మేనేజింగ్ కమిటీని ఎన్నుకున్నారు. 2025-2026 సంవత్సరాలకు గాను ఈ కమిటీ అమల్లో ఉండనుంది. పరిశ్రమ ప్రాతినిధ్యం పెంచడం, తెలంగాణ అంతటా రియల్ ఎస్టేట్ అభివృద్ధిని వేగవంతం చేసేలా కొత్తగా ఎన్నికైన నాయకత్వ బృందం బాధ్యత వహించనుందని ఆ వర్గాలు తెలిపాయి. కాగా.. క్రెడాయ్ తెలంగాణ ఎన్నికైన ఆఫీస్ బేరర్లలో చైర్మన్‌గా ప్రేమ్ సాగర్ రెడ్డి, అధ్యక్షుడిగా కె. ఇంద్ర సేన రెడ్డి ఉన్నారు. ప్రెసిడెంట్ ఎలెక్ట్‌గా ఎస్. రాంరెడ్డి ఉన్నారు. ఉపాధ్యక్షులుగా ఎం. శ్రీకాంత్, గోవర్ధన్ రెడ్డి, రాంరెడ్డి, సత్యనారాయణ రెడ్డి నియమితులయ్యారు. పల్లెర్ల నాగప్రసాద్ జాయింట్ సెక్రటరీగా వ్యవహరిస్తారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఈ బృందం తెలంగాణ ప్రభుత్వంతో భాగస్వామ్యాన్ని బలోపేతం చేయాలని నిర్దేశించుకుంది. "మౌలిక సదుపాయాల నుండి పారిశ్రామిక సమూహాల వరకు తెలంగాణ వేగంగా విస్తరిస్తోంది. భవిష్యత్ వృద్ధి కోసం మనం రెండు మరియు మూడవ అంచె నగరాలపై దృష్టి పెట్టాలి. " అని నూతన చైర్మన్ ప్రేమ్ సాగర్ రెడ్డి పేర్కొన్నారు. "తెలంగాణ వ్యవస్థలు, ప్రక్రియలు భారతదేశానికే కాకుండా ప్రపంచవ్యాప్తంగా బెంచ్‌మార్క్‌లను నిర్దేశించనున్నాయి." అని క్రెడాయ్ తెలంగాణ అధ్యక్షుడు కె ఇంద్రసేన రెడ్డి అన్నారు. "మెట్రోయేతర ప్రాంతాల సమగ్ర అభివద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వానికి మద్దతు ఇవ్వడానికి మేము కట్టుబడి ఉన్నాము. ఇది హైదరాబాద్ నగరంపై పెరుగుతున్న ఒత్తిడిని తగ్గించడానికి, అన్ని ప్రాంతాలలో వృద్ధిని ప్రోత్సహించడానికి సహాయపడుతుంది." అని క్రెడాయ్ తెలంగాణ ప్రెసిడెంట్ ఎలెక్ట్ ఎస్ రామ్ రెడ్డి తెలిపారు. "క్రెడాయ్ తెలంగాణా అన్ని అధ్యాయాలలో ఆర్థిక పారదర్శకత, వివేకవంతమైన వనరుల నిర్వహణను నిర్ధారించడం మా లక్ష్యం." అని కోశాధికారి జగన్ మోహన్ పేర్కొన్నారు.